# గత వారం చిలిపి ప్రశ్న

కాన్వెంట్ అంటే?

పంపినవారు: ఆర్.చంద్రలేఖ
మంగళగిరి

బహుమతి పొందిన సమాధానం

విద్యను విక్రయించే సూపర్ మార్కెట్
— పి.కాశిరావ్, చిలకలూరిపేట

* తెలుగువారికి ఇంగ్లీషు నేర్పేది
— రంగిశెట్టి రవి, నవులూర్

* అధిక వ్యాపార సంస్థలాంటిది
— ఎం.మహేంద్ర, విజయవాడ

* నిరుద్యోగులపాలిట వరం
— సి.వెంకోబరావ్

* మధ్యతరగతి వాడిని వెక్కిరించేది
— ఘంటా శివశేఖర్ ప్రసాద్, చీరాల

* స్థాపకులకు కనకవర్షాలు కురిపించేందుకు
— డి.జి. అన్నపూర్ణ, హైదరాబాద్

* ఉద్యోగి పిల్లల పగటి సంరక్షణ కేంద్రాలు
— డి.నబెన్న, బేస్తవారిపేట

* 5000 డొనేషన్ 300 మంత్లీ ఫీజు
— ఎ.వెంకటేష్, కర్నూల్

* విద్యకు ఖరీదు కట్టే చోటు
— షేక్ హసన్‌వలి, చిలకలూరిపేట

* పేదపిల్లలకు ఎంట్రన్స్ లేని స్కూలే
— మైనేని శ్రీనివాస్, పాండిచ్చేరి

* కొని చదువుకొనే కర్మాగారం
— డి.వెంకటేశ్వర్లు, ఇల్లెందు

* విద్యను కొనేందుకు పునాది వేసేది
— కె.వెంకటరమణ, తిరుపతి

# ఈ వారం చిలిపి ప్రశ్న

* ఇద్దరు ఒకటయ్యేది ఎందుకు?

ఎ.రజని, కర్నూల్

— (గమ్మత్తు కథ) —

# ఫస్ట్‌నైట్

— ధనికొండ రవిప్రసాద్

గుమ్మాలనిండా తోరణాలు.

కుర్రకారుకి హుషారెక్కించే లలిత శృంగార గీతాలతో వీనుల విందుచేస్తోంది టేప్‌రికార్డరు. ఇంటినిండా ఎక్కడ చూసినా మల్లెపూల మత్తు వాసనలు. అగరొత్తుల ఘుమ ఘుమలు. ఆ ఇంట్లో తిరుగుతున్న ప్రతి స్త్రీ ఒక పెళ్ళి కూతురిలాగా ముస్తాబయింది. ఆ ఇంట్లో కొందరు వయసు మళ్ళిన మొగ వాళ్ళ మొహాల్లో మాత్రం "ప్చ్! ఏమిటో ఇలాంటి ఆనందాలనుభవించి ఎంత కాలమైందో" అనే బాధ కనిపిస్తోంది.

వసంత ఋతువుకి సూక్ష్మ రూపంలాగా ఒక పెళ్ళి కూతురు. మల్లెపూల వల్ల ఆమెకి సుగంధం వొచ్చిందా ఆమె సౌందర్యంవల్లే మల్లెలకి సువాసన అబ్బిందా! అనేది ప్రశ్న. ఆమెని చూస్తే తప్పకుండా వస్తుంది.

అన్నివిధాలా ఆమెకి తగ్గ పెళ్ళికొడుకు మౌనంగా, హుందాగా ఒక కుర్చీలో కూర్చున్నాడు.

ముహూర్తం దగ్గర పడింది.

"లోపలికి రా నాయనా" అంటూ పిలిచారు పెళ్ళికొడుకుని. అతను లేవలేదు.

"దారా బాబూ! టైమౌతోంది" అంటూ చెయ్యి పుచ్చుకుంది పెళ్ళికొడుకు తల్లి.

"ఒద్దు" అన్నాడు పెళ్ళికొడుకు.

ఒక్కసారే అంతా నిర్ఘాంతపోయారు. అమ్మాయి జీవితం గంగలో కలిసినట్టే అనే కంగారు ఆడపెళ్ళివాళ్ళల్లో సన్నగా చోటుచేసుకుంది.

ఒక పెద్దమనిషి ఆడపెళ్ళివాళ్ళకి చిన్నగా సలహా చెప్పాడు. "అబ్బాయి కాస్త సిగ్గుపడుతున్నట్టున్నాడు. పోనీ ముందుగా అమ్మాయినే పంపిస్తే?" అని.

"ఇదెక్కడి విడ్డూరమయ్యా బాబూ! ఎక్కడైనా అమ్మాయి సిగ్గుపడుతుందికానీ మీ అబ్బాయే సిగ్గుపడుతున్నాడేమిటి?" అంటూ నసిగారు ఆడ పెళ్ళివాళ్ళు.

"సరే! కాలం అలా మారిపోయిందేమో! ఈమధ్యకాలంలో అమ్మాయిలే అబ్బాయిల్నేడిపిస్తున్నారు. అబ్బాయిలు తప్పించుకు తిరుగుతున్నారు" అని సరిపెట్టుకున్నారు మళ్ళీ.

ఒకరిద్దరు ఆడపెళ్ళివాళ్ళు మగ పెళ్ళివాళ్ళని దుమ్మెత్తిపొయ్యటం ప్రారంభించేశారు రహస్యంగా. "ఇంత కట్నమూ పోసి ఇంపొటెంటు"ని తెచ్చామని.

"సరే! నువ్వైనా రా అమ్మా" అంటూ అమ్మాయి చెయ్యి పుచ్చుకున్నారు ఇద్దరాడవాళ్ళు.

అమ్మాయి చెయ్యి గుంజుకుంది. "ఛీ! వద్దులే" అంటే, "మగపెళ్ళివాళ్ళకి ఒక పాయింట్ బుర్రలో తట్టింది. "మా అబ్బాయి రానంటే గొణుక్కున్నారుగా! మరి వాళ్ళమ్మాయి రానంటోందే!" అని.

"ఏం అమ్మా! ఆయన రానన్నందుకు కోపం వచ్చిందా?" అని పెళ్ళికూతుర్ని ప్రశ్నించి ఇన్‌డైరెక్ట్‌గా పెళ్ళికూతుర్ని సమర్థించి తప్పని పెళ్ళికొడుకు మీదకే తోసేసింది ఒక పెద్దాపిడ.

"ఏమండీ! రండీ! ప్లీజ్!" అంటూ పైట చెంగుని పెళ్ళికొడుక్కి తగిలించి గడ్డం పట్టుకు బతిమాలింది. ఒక ముప్పైఅయిదు సంవత్సరాల ముదురు అమ్మాయి.

పెళ్ళికొడుకు లొంగలేదు. ఒకసారి పెళ్ళికొడుకుని తాకిన సరదా మాత్రం ఆమెకి దక్కింది. "హబ్బా! ఓరందగాడా! నువ్వే నా మొగుడివైతేనా! ఈపాటికి గదిలోకి ఈడ్చుకెళ్ళి రేప్‌చేసి ఉండేదాన్ని" అంటూ మౌనంగా మనస్సులోనే విలవిల్లాడిపో



యింది ఆ ఆరితేరిన వెరజాణ. పైట తీసి కాసేపు విసురుకుంది పెళ్ళికొడుకు ఎదుట.

ముహూర్తమైతే దాటిపోయింది. ఇద్దరిలో ఎవరి ఆరోగ్య లోపమో ఏమో, ఎవరిది పెంకెతనమో ఎవరి లోపం ఏమిటో అర్థం కావట్లేదు పెద్దవాళ్ళకి.

చివరికొక ఆధునికుడు సలహా చెప్పాడు. "ఈ రోజుల్లో పెళ్ళికూతుళ్ళు, పెళ్ళికొడుకులూ మానసికంగా ఎదిగిపోతున్నారు. ప్రకృతి సహజంగా లభించే ఈ ఆనందానికి ముహూర్తాలేమిటి? పదిమంది కలిసి అసహ్యంగా గదిలోకి పంపటమేమిటి? గొడ్లని కలిపినట్టు. మనం ఊరుకుంటే వాళ్ళంతట వాళ్ళే కలుసుకుంటారు" అని.

చివరికి ఇష్టం ఉండో లేకో అందరూ అతని సలహానే వినాల్సొచ్చింది. కళ్ళు కాయలు కాసేటట్టున్నాయి. నిద్రకి ఆశలేక ఎవళ్ళకి వాళ్ళే వేలాడిపోయారు. అందరికీ కునుకు పట్టింది.

* * *

"అబ్బ! రామచంద్రా! బొత్తిగా నిద్ర పట్టటల్లేదు. అస్సలు గాలాడటల్లేదు" అంటూ విసనకర్రతో విసురుకుంటూ ఆపసోపాలు పడుతున్నాడొక ముసలాయన. కాసేపు బయటికన్నా పోదాము అంటూ వాకిలి తలుపు తియ్యబోయాడు. ఘడియ తీసినా తలుపు తెరుచుకోటల్లేదు. దొడ్డి వేపుకి పోదామా అంటే అంతా ఆడవాళ్ళే. అలా వంటింట్లోకి పోటం బాగుండదు. ఒక్క క్షణం ఆలోచించాడు ముసలాయన. ముసలావిడ్ని లేపాడు.

"ఏమోనండీ! ఇవ్వన్నీ గాలిచేష్టల్లాగా నాకనుమానంగా వుంది. శుబ్బరంగా ఆరోగ్యంగా వున్న పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు కార్యం చేసుకోకుండా అడ్డం తిరగటమేమిటి? ఏ దెయ్యమో బయట గొళ్ళెం పెట్టిందేమో? ఈ కొంప చూస్తే నాకు మొట్ట మొదటే దెయ్యపు కొంపలాగా అనిపించిందండీ! భగవంతుడా" అంటూ సన్నగా గొణగటం మొదలెట్టింది ముసలావిడ.

"ఛీ! నోర్ముయ్! దెయ్యమా పాడా! ఎవడో దొంగాడు చేసిన పని" అని చెప్పి తలుపులు దబదబా బాదటం మొదలెట్టాడు ముసలాయన.

తెల్లవారబోతోంది. బయట తలుపు తెరుచుకుంది. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ తలుపులు తీసుకుని లోపలికి ప్రవేశించారు సిగ్గుపడుతూ (సిగ్గు నటిస్తూ).

"ఒరేయ్! ఒరేయ్! ఏమిటర్రా! ఎక్కడున్నారసలు మీరు?" అంటూ తెల్లబోయారు ముసలమ్మా ముసలాయనా కూడా.

"ఘశ్శు! కంగారు పడకు తాతయ్యా! మీరు పడే బాధే మేమూ పడుతున్నాం. ఈ ఎండాకాలం మరీ ఘోరంగా ఉంది.లోపల పడుకుంటే బొత్తిగా గాలాడట్లేదు" అన్నాడు పెళ్ళికొడుకు.

తెల్లబోయి చూసిన ముసలాయనకి రెండు క్షణాల్లో ట్యూబ్‌లైట్ వెలిగినట్టయింది. అంతవరకూ తెరిచి వుంచిన బోసి నోటిమీద సంతోషమైన చిరునవ్వు వెలిసింది. "ఓరి వెధవా! మీ ఇద్దరూ మొత్తానికి స్పీడుగానే ఉన్నారు. ఔన్లే ఈ ఎండాకాలం అసలే గాలాడక మేమంతా చస్తుంటే ఈ ఉక్కపోతలో గదిలో శోభనం జరుపుకుని మీరేం సుఖపడతారు? పెళ్ళిళ్ళు ఎండల్లో కాదు. చలికాలంలో చెయ్యాలి. ఆ బుద్ధి ముహూర్తాలు పెట్టిన వాళ్ళకి లేదు. మీ అమ్మా వాళ్ళలకీ లేదు. హాయిగా ఇంటి బయట మల్లె పందిరికింద మీకు మీరే శోభనం పూర్తిచేసుకుని మా అందర్నీ ఇంట్లో పెట్టి తాళం వేశారన్నమాట 'భడవ' " పొట్టలో పొడిచి మరీ నవ్వారు తాతగారు.

"అయ్యో! మరీ మైకులో అరవబోకు తాతయ్యా!" అంటూ గడ్డం పట్టుకున్నాడు మనవడి వరసైన పెళ్ళికొడుకు.